క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: నవులూరు, బాపూజీ నగర్, ఉడా కాలనీ, శిబిరం, నిడమర్రు రోడ్డు, ఆర్‌ఆర్ టవర్స్, టిప్పర్ల బజార్ మార్కండేయ కాలనీ, ఆటో నగర్, రాజీవ్ గృహ కల్ప, టిడ్కో నివాసాలు, ఎన్‌ఆర్‌ఐ వరకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ డీఏఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లేన్ల మరమ్మతుల దృష్ట్యా అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం మెల్లెంపూడి, కేఎల్ యూ రోడ్, గుండిమెడ, వడ్డేశ్వరం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఉండవల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ సదస్సు



తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విజయవాడ మహా నగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా అన్నపురెడ్డి కోటిరెడ్డి పాల్గొని, బలమైన కోరికతో లక్ష్యాన్ని సాధించాలని విద్యార్థులకు సూచించారు. రెండుసార్లు మెట్రిక్యులేషన్ తప్పిన యార్లగడ్డ సుబ్బారావు ప్రఖ్యాత వైద్యునిగా దేశానికి ఎంతో పేరు తీసుకొచ్చారని గుర్తుచేశారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, బుజ్జిబాబు, కె.వెంకటేశ్వరరావు, శ్రీరామచంద్రారెడ్డి, ఎం.రమాదేవి, డీవీ రమణమ్మ, అరుణ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్



తాడేపల్లిరూరల్ : ఉండవల్లిలోని హిందూ శ్మశాన వాటికలో శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఉండవల్లికి చెందిన కళ్ళం సాంబిరెడ్డి ఆధ్వర్యంలో అమరావతి రోడ్డు నుంచి కొండవీటి వాగు వరకు ఉన్న శ్మశానంలో ఉన్న ముళ్ల పొదలు, ఇతర వ్యర్థాలు తొలగించారు. చెట్ల కొమ్మలను తొలగించారు.

పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



ఫిరంగిపురం: నుదురుపాడు జెడ్పీ పాఠశాల గ్రంథాలయానికి శుక్రవారం పూర్వ విద్యార్థులు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం ఇమ్మానియేల్ మాట్లాడుతూ పాఠశాలలో 1986–87 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు షేక్.నూర్ అహ్మద్, సయ్యద్ అల్లా బక్షు, టి.సుభాని, షేక్.జున్నూసాహెబ్ రూ.20వేల విలువైన పుస్తకాలు గ్రంథాలయానికి అందజేశారని చెప్పారు. అనంతరం పూర్వ విద్యార్థులను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దొడ్డా నాగిరెడ్డి సన్మానించారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

మంగళగిరి పట్టణంలోని గ్రంథాలయానికి దేవులపల్లి అమర్ రచించిన పుస్తకాలను అందజేశారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సలహాదారుడు చల్లా మధుసూదన్‌రెడ్డి ప్రముఖ సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ రచించిన మూడు దారులు(తెలుగు) డెక్కన్ పవర్ ప్లే(ఇంగ్లీషు) పుస్తకాలను గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావుకు శుక్రవారం అందజేశారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. బాలగురవయ్య వికలాంగుల కాలనీలో రేషన్ బియ్యం తరలిస్తుండగా, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 150 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో మల్లేశ్వరి శ్రీనివాసరావుపేట రేషన్ బియ్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని, 150 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక దన్ను



గత టీడీపీ ప్రభుత్వంలో బ్యాంకు వద్ద ధర్నా చేస్తున్న డ్వాక్రా మహిళలు (ఫైల్ ఫొటో)



వైఎస్సార్ ఆసరా నమూనా నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, సమన్వయకర్త చిరంజీవి(ఫైల్

- మంగళగిరిలో రూ.189.58 కోట్ల డ్వాక్రా రుణమాఫీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు

తాడేపల్లిరూరల్ : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో రుణమాఫీ విషయంలో భంగపడ్డ డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్థిక దన్నుగా నిలిచింది. వైఎస్సార్ ఆసరా పథకంతో నాలుగు విడతల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా రుణాలను మాఫీ చేశారు. చంద్రబాబు రుణ మాఫీ హామీకి మోసపోయి, రుణాలు చెల్లించక, వడ్డీలు పెరిగిపోయి.. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంలో రోడ్లపైకి వచ్చి సంబంధిత బ్యాంకుల వద్ద ధర్నాలు నిర్వహించారు. తన పాదయాత్రలో డ్వాక్రా అక్కచెల్లెమ్మల కన్నీరు తుడుస్తానని మాటిచ్చిన సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే.. ఆ మాటను నిలబెట్టుకున్నారు.

మంగళగిరిలో రుణ మాఫీ ఇలా..

మంగళగిరి నియోజకవర్గంలో 4,816 పొదుపు గ్రూపుల్లో 47,428 మంది సభ్యులున్నారు. వైఎస్సార్ ఆసరా కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.189.58 కోట్ల రుణాన్ని నాలుగు విడతల్లో మాఫీ చేసింది. సున్నా వడ్డీ, పావలా వడ్డీలకు ఒక్కో మహిళకు రూ.2 నుంచి రూ.5 లక్షల రుణ సదుపాయాన్ని కలిపించింది. ఉపాధి పరంగా మహిళలు నిలదొక్కుకునేందుకు తోడ్పాటునందించింది.

న్యాయం జరిగింది



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డ్వాక్రా మహిళలకు న్యాయం జరిగింది. సీఎం వైఎస్ జగన్ రుణ మాఫీ చేశారు. మా గ్రూపులో ఒక్కొక్కరికి రూ.75 వేలు చొప్పున రూ.7.50లక్షలు సభ్యుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసింది. కొత్త రుణాలు కూడా ఇచ్చింది.

– లక్ష్మి, శ్రీ లక్ష్మి గ్రూప్, నులకపేట

రుణ మాఫీ అయ్యింది



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వల్ల మా గ్రూప్‌నకు రూ.8,04,366లు రుణ మాఫీ జరిగింది. దీంతో సభ్యులందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో నగదు జమ చేయడంతో గ్రూపులు కూడా డిఫాల్ట్ కాలేదు.

– నాగలక్ష్మి, శ్రీ ఓంసాయి గ్రూప్, తాడేపల్లి

దొండపాడులో టీడీపీ నేత దాష్టీకం

ఎండీయూ ఆపరేటర్‌పై దాడి, దూషణ



బాధితుడు కోటేశ్వరరావు

తాడికొండ: రాజధాని ప్రాంతం తుళ్లూరు మండలం దొండపాడులో టీడీపీ నేత దాష్టికానికి పాల్పడ్డాడు. ఎండీయూ వాహనం ఆపరేటర్‌ను కులం పేరుతో దూషించి, దాడిచేసిన ఘటన శుక్రవారం జరిగింది. బాధితుడు మిట్టనోసుల కోటేశ్వరరావు వివరాల మేరకు.. దొండపాడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం రేషన్ బియ్యం పంపిణీ చేయడానికి వచ్చిన కోటేశ్వరరావును అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొలసాని శ్రీనివాసరావు అడ్డుకొన్నారు. బియ్యం తన ఇంటివద్ద ఇచ్చి పాయింట్‌కు వెళ్లాలని హుకుం జారీ చేశారు. కొంచెం ముందు పాయింట్ ఉందని, లబ్ధిదారులంతా అక్కడ ఉన్నారని చెప్పినా వినకుండా.. శ్రీనివాసరావు కులం పేరుతో దూషించి, కాలితో దాడి చేశారని బాధితుడు తెలిపారు. బియ్యం వాహనాన్ని అక్కడే వదిలి తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సాంకేతికత వినియోగంతో ఆహారోత్పత్తి పెంపు



రెక్టార్ వరప్రసాదమూర్తిని సన్మానిస్తున్న రిజిస్ట్రార్ కరుణ

ఏఎన్‌యూ: వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను వినియోగించడం వల్ల ఆహార ఉత్పత్తిని పెంచడం సాధ్యమవుతుందని రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో ' భారతదేశ వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక సవాళ్లు, వ్యూహాలు– ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సూచన' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రసంగిస్తూ సాంకేతికత వినియోగం వల్ల ఎక్కువ మంది ప్రజలకు పౌష్టికాహారం అందుబాటులోకి తీసుకురావచ్చని తెలిపారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచుతుందని చెప్పారు. సభకు రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి అధ్యక్షత వహించారు. ఓఎస్‌డీ ఆచార్య సునీత తదితరులు ప్రసంగించారు. సదస్సులో పరిశోధనా పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య మధుబాబు నివేదికను సమర్పించారు.

అగ్రికల్చర్ మార్కెటింగ్ ప్రాధాన్య అంశం

వ్యవసాయ రంగంలో మార్కెటింగ్ అనేది రైతులకు ఎంతో ప్రాధాన్యమైన విషయమని ఎంఏ ఎకనామిక్స్ విద్యార్థిని సుశి వాసంతి అన్నారు. సదస్సులో ఆమె పరిశోధనా పత్రం సమర్పించారు. నిరక్షరాస్యత, అవగాహనా లోపం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల మార్కెంటింగ్ మెళకువలు, పరిస్థితులను రైతులు అవగాహన చేసుకోలేకపోతున్నారని తెలిపారు. ఏపీఎంసీ(అగ్రికల్చర్ ప్రొడ్యూస్ మార్కెటింగ్ కమిటీలు) ఈ అంశంలో కీలకపాత్ర పోషించాలని ఆమె సూచించారు.

జీజీహెచ్‌లో రూ. 20 లక్షలతో రేకుల షెడ్డు నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్ : ఆసుపత్రి అవుట్‌పేషెంట్ విభాగం వద్ద రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న రేకుల షెడ్డుకు శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ అయిదువేల మంది ఆసుపత్రికి వస్తున్నట్లు వెల్లడించారు. రోగులు వారి సహాయకుల కోసం ప్రత్యేకంగా షెడ్డును నిర్మిస్తున్నట్లు చెప్పారు.

జీజీహెచ్‌కి ప్రింటర్, కుర్చీల బహూకరణ

జీజీహెచ్‌కి ప్రింటర్‌తో పాటు 17 కుర్చీలను వైష్ణవ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పి.చిరంజీవి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ యోగిత, డాక్టర్ సునీత, బయో మెడికల్ ఇంజనీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేపు బజరంగ్ సంక్షేమ సంగమం వైద్య శిబిరాలు

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



కళ్లజోళ్లు పొందిన మునిపల్లె గ్రామస్తులతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: బజరంగ్ సంక్షేమ సంగమం సేవా కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 11వ తేదీన పెదకాకానిలో బజరంగ్ నేత్రజ్యోతి, మీ గుండె పదిలం, బజరంగ్ దివ్యాంగ దర్శిని, ఫిజియోథెరపీ సేవల్ని ఉచితంగా అందించేందుకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని గ్రామాల్లో బజరంగ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. పెదకాకానిలో ఆదివారం లూథర్‌గిరి గ్రంథాలయం వద్ద, సోమవారం శివాలయం రోడ్డులోని బ్రహ్మంగారి ఆలయం వద్ద నేత్ర జ్యోతి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి వారం రోజుల్లో కళ్లజోళ్లు అందజేస్తామని తెలిపారు. మీ గుండె పదిలం ద్వారా అవసరమైన వారికి యాంజియో, గుండె ఆపరేషన్లు, స్టెంట్లు వేయిస్తామని చెప్పారు. దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు, ఉచితంగా త్రిచక్ర వాహనాలు, జైపూర్ కాళ్లు, వెస్ట్రన్ కమోడ్‌లు సమకూరుస్తున్నట్లు వివరించారు.

355 మందికి కళ్లజోళ్ల పంపిణీ

కొరిటిపాడు(గుంటూరు): పొన్నూరు మండలం మునిపల్లె గ్రామంలో జనవరి 31వ తేదీన నిర్వహించిన నేత్ర జ్యోతి వైద్య శిబిరంలో అవసరమైన 355 మందికి శుక్రవారం అంబటి మురళీకృష్ణ కళ్లజోళ్ల పంపిణీ చేశారు. బ్రాహ్మణకోడూరు గ్రామానికి చెందిన 355 మందికి కళ్లజోళ్లు అందజేసినట్టు ఆయన వివరించారు.

గుంటూరు చేరుకున్న రజకుల పాదయాత్ర

నెహ్రూనగర్: రజకుల్ని ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ నేషనల్ ధోబీ మహాసంగ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు తిరుపతి నుంచి విజయవాడ వరకు చేపట్టిన మహా పాదయాత్ర శుక్రవారం గుంటూరు కు చేరుకుంది. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రజకులు 18 రాష్ట్రాల్లో, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్సీలుగా మరికొన్ని చోట్ల ఎస్టీలుగా కొనసాగుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రజకులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. గుంటూరుకు పాదయాత్రగా వచ్చిన నాగమల్లేశ్వరరావుకు మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు సంఘీభావం తెలియజేశారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలు ఎంపిక



తాడికొండ: తుళ్ళూరు మండల ఎమ్మార్పీఎస్ కమిటీలను ఎన్నుకున్నట్లు ఆ ఆపార్టీ ఇన్‌చార్జి పల్లెపోగు రాజారావు శుక్రవారం తెలిపారు. అధ్యక్షుడుగా పత్తిపాటి ప్రవీణ్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా బాలరాజు మాదిగ, ఎంఎస్పీ కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు సుధీర్ మాదిగ మాట్లాడుతూ రెండు నెలల్లో వర్గీకరణపై శుభవార్త వినునున్నట్లు తెలిపారు. జిల్లా ఎంఎస్పీ అధ్యక్షుడు మరికిపూడి హృదయరాజు మాదిగ, మహిళా అధ్యక్షురాలు జ్యోతి మాదిగ, సీనియర్ నాయకులు పల్లెపోగు థామస్ మాదిగ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: యువకుడి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 28 సంవత్సరాల బి.వినయ్‌కుమార్ నాయుడుపేటలో నివాసం ఉంటున్నాడు. మూడు నెలల కిందట హైదరాబాద్‌లో శాప్ కోచింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

యువకుడి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తకాలనీలో నివసించే షేక్ జాన్‌సైదా (27)వ్యక్తి గత కారణాల వల్ల మానసికంగా కుంగిపోయి శుక్రవారం ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి

నగరంపాలెం: దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతుల్ని వెంటనే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. కొత్తపేట సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్సూరెన్స్ ద్వారా యాభై శాతం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాద ఘటనపై ఈనెల 12న కలెక్టరేట్‌లో జరగనున్న స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, తెలుగు రైతు సంఘం నేత కల్లం రాజశేఖర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుపతయ్య, పసుపు రైతులు పాల్గొన్నారు.

చరణ్‌సింగ్, పీవీలకు భారతరత్నపై హర్షం

గుంటూరు ఎడ్యుకేషన్: మాజీ ప్రధాని చరణ్‌సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడం పట్ల రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ హర్షం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని తన నివాసంలో మాట్లాడుతూ దేశ ప్రధానిగా చరణ్‌సింగ్ మహాత్మా గాంధీ స్ఫూర్తితో రైతాంగ సంక్షేమ కోసం కృషి చేశారని తెలిపారు. 1979 అక్టోబర్‌లో గుంటూరులోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభకు హాజరైన ప్రధానమంత్రి చరణ్‌సింగ్ ఉపన్యాసాన్ని తెలుగులోకి అనువదించిన సందర్భాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.

ఆర్థిక వ్యవస్థకు వన్నె తెచ్చిన పీవీ

గుంటూరు మెడికల్: భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వన్నె తెచ్చి, దేశాభివృద్ధికి తోడ్పడిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావును భారతరత్నతో గౌరవించడం తెలుగు వారికి గర్వకారణమని బీజేపీ జిల్లా నేతలు పేర్కొన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్, పబ్లిసిటీ అండ్ లిటరేచర్ రాష్ట్ర కన్వీనర్ పాలపాటి రవికుమార్ ఉన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు



విద్యార్థులకు మాత్రలు అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ గిరిధరరావు



తాడేపల్లి గేటు సెంటర్‌లోని పాఠశాలలో...



శాంతిపేట ఎంపీపీ పాఠశాలలో..

తాడేపల్లిరూరల్ : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా దుగ్గిరాలలోని డాక్టర్ కేఆర్‌ఆర్‌ఎం డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గిరిధరరావు మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడంతో కడుపులో నులి పురుగులు నశించి, ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి బి.రాంబాబు, కె. సరళాదేవి, ఎం.విజయ్‌కృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఆశ వర్కర్ మాలతి విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ పరిధిలో..

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ అంబేడ్కర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు మానస, సీతానగరం పీహెచ్‌సీ వైద్యులు శాంతకుమారి, దుగ్గిరాల ఈమని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఇందిర, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూప వాణి శుక్రవారం నులిపురుగుల నివారణ మాత్రలు పాఠశాలల్లో పంపిణీ చేశారు. వైద్యులు సూచించిన మేరకు తప్పనిసరిగా మందులను తీసుకోవాలని, దానివల్ల కడుపులో ఉన్న నులిపురుగులు తొలగి కడుపులో నొప్పి ఇతర సమస్యలు పరిష్కారమవుతాయని వారు ఈ సందర్భంగా తెలిపారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

ఫిరంగిపురం: నులిపురుగుల నివారణతోనే చిన్నారులకు ఆరోగ్యం చేకూరుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని శాంతిపేట ఎంపీపీ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎస్ కె.సుదర్శన్, ఎంఎల్‌హెచ్‌పీ గోవర్ధన్, ఏఎన్ఎంలు భారతీజ్యోతి, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రవాణా రంగంలో ట్యాక్సీ డ్రైవర్లు కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్

తాడేపల్లిరూరల్ : రవాణా రంగంలో ట్యాక్సీ డ్రైవర్లు కీలకమని మన ఆంధ్ర – మన ట్యాక్సీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కస్తూరి భాస్కర్ అన్నారు. శుక్రవారం కొలనుకొండలో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కస్తూరి భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన అసోసియేషన్ ద్వారా డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. డీజిల్ రేట్లు పెరుగుతున్నా, ట్యాక్సీ కిరాయి రేట్లు పెరగడం లేదని, ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అసోసియేషన్ కార్యదర్శి ఎస్. ఫణికుమార్ మాట్లాడుతూ గతంలో గ్రీన్ టాక్స్ రూ.వెయ్యి ఉండేదని, ఇప్పుడు రూ.4 వేలు అయ్యిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బైరెడ్డి రవీందర్‌రెడ్డి, రామిరెడ్డి, సెక్రటరీలు వెంకటేశ్వర్లు, కలందర్ సుందర్ శెట్టి, ఫణీంద్ర, కోశాధికారి దాసరి మురళి, ఈసీ మెంబర్స్ యంత్రప్రగడ మధు, గుడవర్తి నాని పాల్గొన్నారు.

కార్పొరేటర్ల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

కమిషనర్ కీర్తి చేకూరి



కార్పొరేటర్ నుంచి అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల్ని సత్వరం పరిష్కరించాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. వార్డుల వారీగా అభివృద్ధి పనుల్లో కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్ర అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలపాలని అధికారుల్ని ఆదేశించారు.

నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి

నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల్ని కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. కమిషనర్ తన చాంబర్‌లో శుక్రవారం నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులకు సంబంధిన బిల్లుల ఆన్‌లైన్, చెల్లింపుల్లో ఎదురయ్యే సమస్యల్ని ప్రతి శుక్రవారం జరిగే స్పెషల్ గ్రీవెన్స్‌లో తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. నగరంలో జరిగిన కొన్ని అభివృద్ధి పనులపై ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని ఇంజినీరింగ్ అధికారులు మరొకసారి పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు జరిగే సమయంలోనే ఆయా స్టేజీల ప్రకారం ఎంబుక్‌లో రికార్డ్ చేయించాలని ఏఈలను ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా అన్ని స్టేజిల్లో వేగంగా రికార్డు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈని ఆదేశించారు.

ఆరోగ్య సంరక్షణకు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, సమన్వయకర్త గంజి చిరంజీవి

ఎమ్మెల్సీ హనుమంతరావు, సమన్వయకర్త గంజి చిరంజీవి

మంగళగిరి: చిన్నతనంలో జీర్ణకోశ వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరు అల్బెండజోల్(నులిపురుగుల నివారణ మాత్రలు) వేసుకోవాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వకర్త గంజి చిరంజీవి తెలిపారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం మాత్రలు పంపిణీ చేస్తుందన్నారు. అల్బెండజోల్ మాత్రల వేసుకుంటే.. పిల్లలో రక్తహీనత, నీరసం, ఆకలి మందగించడం సమస్యలు తొలగడంతో శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పి.అనూష, పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.